


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 27-07-2022 సంపుటి: 03 సంచిక: 297 పేజీలు: 4 వెల: రూ 3-00


## టీడీపీ ప్రభుత్వం వల్లే ఏపీలో విపరీతంగా అప్పులు: మంత్రి బుగ్గన



విజయవాడ: గతంలో ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వల్లనే విపరీతంగా అప్పులు పెరిగిపోయాయని ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. ఏపీ మాత్రమే అప్పులు చేసినట్లు టీడీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏపీ కంటే తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు ఎక్కువ అప్పులు చేశాయని ఆయన గుర్తుచేశారు. తామెంతో నిబద్ధతతో పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. ఏ సంక్షోభం లేకున్నా 2014-19 మధ్య కాలంలో టీడీపీ విచ్చలవిడిగా అప్పులు చేసిందని ఆరోపించారు. టీడీపీ 8.08 శాతం వడ్డీకి అప్పులు తెస్తే.. తాము 7 శాతానికి తెచ్చినట్లు పేర్కొన్నారు. కరోనా తర్వాత ప్రతీ రాష్ట్రం అప్పులు చేసిందని ఆయన గుర్తుచేశారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలనే దురుద్దేశంతోనే రాష్ట్ర అప్పులపై టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. వివిధ రాష్ట్రాల అప్పులపై పార్లమెంటులో ప్రశ్నిస్తే అది కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే అన్నట్లుగా చిత్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం ఎక్కువగా అప్పులు చేసిందని గుర్తు చేసిన మంత్రి.. ఆ కాలంలో అనవసరమైన దానికంటే ఎక్కువగా అప్పులు చేసిందని అభిప్రాయపడ్డారు. 'మా ప్రభుత్వ అప్పులు చేసింది. టీడీపీ ప్రభుత్వ అప్పులతో పోలిస్తే ఇది చాలా తక్కువ' అని చెప్పారు. కర్ణాటకలో సగటు వార్షిక రుణ భారం రూ. 60,000 కోట్లు, తమిళనాడు అప్పు రూ.లక్ష కోట్లు పెరిగిందన్నారు. జనాభా వారీగా లేదా మరేదైనా ఏపీ రుణ నిష్పత్తి చాలా తక్కువగా ఉందని, స్థూల ఉత్పత్తితో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులు తక్కువగా ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి 15 శాతం నుంచి 16 శాతం అప్పులు పెరిగితే, ఇతర రాష్ట్రాల్లో 20 శాతం పెరిగాయని మంత్రి బుగ్గన చెప్పారు. 2014లో ఆర్థిక లోటు 3.95 శాతంగా ఉండగా, 2021-22లో ప్రభుత్వం 3 శాతానికి తగ్గించిందని తెలిపారు. పొరుగు రాష్ట్రాలు 4 శాతం కంటే ఎక్కువ ఆర్థిక లోటుతో ఉన్నాయన్నారు. సాధారణ ప్రయోజన రుణాల శాతం పెరిగిందని, ఇది కొవిడ్-19 పరిస్థితి కారణంగా జరిగిందని మంత్రి బుగ్గన పేర్కొన్నారు.

## వరద బాధితులందరికీ అండగా ఉంటాం- సీఎం జగన్



అంబేద్కర్ కోనసీమ జిల్లా : భారీ వర్షంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. మంగళవారం ఉదయం అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పీ గన్నవరంలో బాధితులను జగన్ కలుసుకున్నారు. జీ పెదపూడి గ్రామానికి చేరగానే భారీ వర్షం ప్రారంభమైంది. అయినప్పటికీ సీఎం ముందుకే వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. లంక గ్రామాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అధికారుల నుంచి సాయం అందుతుందా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 4 గంటలకు రాజమండ్రి చేరుకుని అధికారులతో సమీక్షిస్తారు. రాత్రికి రాజమండ్రిలోనే బస చేస్తారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లాలో ఆయన పర్యటించనున్నట్లు అధికారులు సమాచారమిచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన లంక గ్రామాల్లో సీఎం జగన్ ఇవాళ పర్యటించారు. ఒకవైపు జోరుగా వాన కురుస్తున్నా లెక్క చేయకుండా ట్రాక్టర్‌లోనే వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. తానున్నానంటూ వారికి భరోసా ఇస్తున్నారు. పుచ్చకాయలవారిపేట చేరుకుని అక్కడి వరద బాధితులతో మాట్లాడారు. ఈ గ్రామంలో నక్కా విజయలక్ష్మి కుటుంబాన్ని సీఎం జగన్ పరామర్శించారు. అనంతరం అరిగెలవారిపేట, ఉద్మడి లంకలో బాధితులను కలుసుకుని వారిని పరామర్శించారు. అరిగెలవారిపేటలో వంతెన నిర్మిస్తానని అక్కడి వారికి హామీ ఇచ్చారు. అక్కడి నుంచి పీ గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి, తర్వాత మేకలపాలెం మండలం రాజోలులో వరద బాధితులతో సమావేశమయ్యారు.వరద బాధితులందరికీ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం జగన్ హామీ ఇచ్చారు. పలువురు బాధితులతో జగన్ ముఖాముఖి మాట్లాడారు. బాధితులకు మంచి చేయాలంటే డ్రామాలు పక్కనపెట్టాలని, బాధితులను



ఆదుకునేందుకు అధికారులకు సమయం ఇవ్వాల్సి ఉన్నందునే ఆలస్యంగా ప్రభావిత ప్రాంతాలకు వచ్చానని సీఎం జగన్ అన్నారు. బాధితులందరికీ మంచి చేసే బాధ్యత ఈ ప్రభుత్వానిదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వపరంగా సాయం ఎలా అందుతున్నది? వాలంటీర్లు ఎలా పని చేస్తున్నారు? అనే విషయాలను స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

## ఏపీ అప్పుల చిట్టాను మరోసారి బయటపెట్టిన కేంద్రం




దిల్లీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తోన్న అప్పుల చిట్టాను మరోసారి కేంద్రం పార్లమెంట్‌లో బయటపెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం అనుమతించిన అప్పుల్లో 3 నెలల్లోనే ఏపీ సగానికిపైగా రుణాలు తీసుకున్నట్లు వెల్లడించింది.రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ వివరాలు వెల్లడించారు. కేంద్రం, నాబార్డు నుంచి కూడా ఏపీ రుణాలు పొందినట్లు తెలిపారు. తెదేపా ఎంపీ కనకమేడల అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. 2022-23లో నికర రుణ పరిమితి కింద ఏపీకి రూ. 44,574 కోట్ల రుణానికి కేంద్రం అనుమతిచ్చింది. మొదటి 9 నెలలకు రూ. 40,803 కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతి ఉంది. అయితే.. ఏపీ ప్రభుత్వం మొదటి 3 నెలల్లోనే 50 శాతానికిపైగా రుణాలు తీసుకున్నట్లు రాజ్యసభలో కేంద్రం వెల్లడించింది. ఏప్రిల్ నాటికే రూ. 21,890 కోట్ల రుణం తీసుకున్నట్లు తెలిపింది. కేంద్రం నుంచి మరో రూ. 1,373.47 కోట్లను ఏపీ రుణంగా తీసుకుంది. అప్పు పుట్టిన ప్రతిచోటా ఏపీ రుణాలు తీసుకుంటున్నట్లు కేంద్రం పేర్కొంది.

## ప్రభుత్వాలను బెదిరిస్తే పనులు కావు: బొత్స సత్యనారాయణ



విజయవాడ: ప్రభుత్వాలను బెదిరిస్తామంటే పనులు కావని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తేల్చి చెప్పారు.విజయవాడలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. పాఠశాలల విలీనం అంశంలో ఉపాధ్యాయుల వైఖరిపై మరోసారి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాలు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న బడి కోసం బస్సు యాత్ర వెనుక ఏ ఉద్దేశాలున్నాయో ఎవరికి తెలుసునని వ్యాఖ్యానించారు. వాళ్లు అనుకున్నవన్నీ కావాలంటే ఎలా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు 8 గంటల పని ఎందుకు చేయరని నిలదీశారు.మరోవైపు విధాన నిర్ణయాలను ప్రశ్నించే అధికారం ఉపాధ్యాయులకు లేదంటూ సోమవారం తాను చేసిన వ్యాఖ్యలను బొత్స సమర్థించుకున్నారు. ఉద్యోగ రీత్యా సమస్యలు ఉంటే మాత్రమే ఉపాధ్యాయులు తమ దృష్టికి తేవాలంటూ స్పష్టం చేశారు. ఉద్యమాలు చేస్తున్న టీచర్లు తమ పిల్లలను ఎక్కడ చదివిస్తున్నారని ప్రశ్నించిన అంశాలు మీడియాలో వచ్చాయన్నారు. మీడియా కథనాలపై స్పందిస్తూ.. హెడ్డింగ్‌లు అటు ఇటు మారినా తన భావాలను ప్రజలకు తెలిపారంటూ మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

## ఉచితాలు ప్రకటించే రాజకీయ పార్టీలను రద్దు చేయాలని పిటిషన్.. కేంద్రం స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వీటిని ఆయా పార్టీలు నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. దీనిపై స్పందన తెలపాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేసింది.ఎన్నికల్లో ప్రజలపై ఉచిత హామీల వర్షం కురిపిస్తున్న రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని, అలా చేసే పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేసి ఎన్నికల గుర్తును సీజ్ చేయాలని ఓ పిటిషనర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ విషయంలో ఎన్నికల సంఘం ఏమీ చేయలేదా? అని సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం.. ఉచిత హామీలను నియంత్రించే అధికారం తమకు లేదని పేర్కొంది. ఉచిత పథకాలతో రాష్ట్రాలపై ఆర్థిక ప్రభావం ఎలా ఉంటుందని ఓటర్లే నిర్ణయించుకోవాలని న్యాయస్థానానికి తెలిపింది.మొత్తం 6.5 లక్షల కోట్ల అప్పు ఉందని, భారత్ కూడా మరో శ్రీలంక అవుతుందని పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ కోర్టుకు తెలిపారు. ఉచిత పథకాలపై రాష్ట్రాలు వెచ్చించే మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్రం ఆయా రాష్ట్రాలకు రెవెన్యూ కేటాయింపులను నియంత్రించవచ్చా? అనే అంశాన్ని ఫైనాన్స్ కమిషన్‌ను అడిగి తెలుసుకోవాలని కోర్టు కేంద్రానికి సూచించింది.ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఉచిత పథకాలను ప్రకటించి కొన్ని పార్టీలు రాష్ట్రాలను నాశనం చేస్తున్నాయని విమర్శించిన విషయం తెలిసిందే.



## దేశంలో కొత్త రాష్ట్రాల ఏర్పాటు.. కేంద్రం సమాధానమేంటంటే..?

దిల్లీ: దేశంలో కొత్త రాష్ట్రాల ఏర్పాటు అంశంపై మంగళవారం పార్లమెంట్‌లో కేంద్రం సమాధానమిచ్చింది. ప్రస్తుతం కొత్తగా రాష్ట్రాలు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ లేదని వెల్లడించింది.కాంగ్రెస్ ఎంపీ అదూర్ ప్రకాశ్ అడిగిన ప్రశ్నకు హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ప్రభుత్వ వైఖరిని తెలియజేశారు. 'పలు వేదికల నుంచి కొత్త రాష్ట్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు, అభ్యర్థనలు అందుతుంటాయి. అయితే ఏ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిగణనలో లేదు' అని వెల్లడించారు. అలాగే మరో ప్రశ్నకు సమాధానంగా దేశంలో వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 2014లో 70గా ఉందని, 2021 నాటికి 46కు పడిపోయిందని చెప్పారు.సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నారని, ఇతర సభ్యుల హక్కులకు భంగం వాటిల్లుతుందనే కారణంతో ఈ రోజు రాజ్యసభలో 19 మంది ఎంపీలపై వేటు పడింది. తమకు ఈ సస్పెన్షన్ విధించడం ఏమాత్రం ఇష్టం లేదని, భారమైన హృదయంతో ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్రమంత్రి, రాజ్యసభ సభాపక్ష నేత గోయల్ వెల్లడించారు. ప్రభుత్వం చర్చ నుంచి తప్పించుకుంటుందని ప్రతిపక్ష పార్టీ నేతలు ఆరోపిస్తున్నా, వాస్తవంలో ప్రతిపక్షాలే ఈ పని చేస్తున్నాయన్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కరోనా నుంచి కోలుకొని తిరిగి వచ్చిన తర్వాత ధరల పెరుగుదల అంశంపై చర్చిస్తామని వెల్లడించారు. అందుకు తామెప్పుడూ సిద్ధమేనని స్పష్టం చేశారు. ఎన్నో దేశాలతో పోల్చుకుంటే భారత్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడంలో మెరుగ్గా వ్యవహరించిందన్నారు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ధరల పెరుగుదల, నిత్యావసరాలపై జీఎస్టీ వడ్డింపు వంటి అంశాలను వ్యతిరేకిస్తూ విపక్షాలు నిరసనలు చేస్తున్నాయి. దీంతో ఉభయ సభల కార్యకలాపాలు స్తంభిస్తున్నాయి.



## ఏపీలో ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

విజయవాడ: ఏపీ ఈఏపీసెట్-2022 ఫలితాలను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో మంగళవారం ఉదయం విడుదల చేశారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్ష



నిర్వహిస్తున్నారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏపీ ఈఏపీ సెట్ ఈ నెల 4 నుంచి 12 వరకు జరిగాయి.ఇంజినీరింగ్‌లో 89.12 శాతం, అగ్రికల్చర్‌లో 95.6 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదితో పోల్చితే క్వాలిఫయింగ్ శాతం పెరిగిందని చెప్పవచ్చు. కాగా, టాప్ టెన్‌లో 4 స్థానాలు తెలంగాణకు చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. 3,84,000 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షల ద్వారా ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తారు. మొత్తం 2,82,496 మంది పరీక్షలు రాయగా, అందులో 1,94,752 మంది ఇంజినీరింగ్ పరీక్షకు, 87,744 మంది అగ్రికల్చర్ కోర్సుకు హాజరయ్యారు.

## భారత సైనిక వీరుల త్యాగఫలం కార్గిల్ విజయ్ దివస్: పవన్

అమరావతి : భారత సైనిక వీరుల త్యాగఫలమే కార్గిల్ విజయ్ దివస్ అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 1999 జులై 26న భారత సైనికులు శత్రుమూకలను తరిమికొట్టి కార్గిల్ కొండలపై మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసిన చారిత్రాత్మక శుభదినమని అన్నారు. భారత సైనికుల ధైర్య సాహసాలు, వీరోచిత పోరాటాలు చూసి ప్రపంచం అచ్చెరువొందిన రోజని అన్నారు.ఈ విజయ సాధనలో 527 మంది సైనికులు వీర మరణం పొందడం గుండెలను పిండేసే వాస్తవమని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ పోరాటంలో ప్రాణాలను అర్పించిన భారత సైనికులకు శిరస్సు వంచి వందనం చేస్తున్నానని, వారి ధీరత్వానికి జోహార్లు అర్పిస్తున్నానన్నారు. శత్రువులను తరిమివేయడానికి భారత సైనికులు చూపిన తెగువ,పోరాటం గురించి ప్రతి ఒక్కరం తెలుసుకోవాలన్నారు. మన దేశ భూభాగాన్ని రక్షించిన వారి త్యాగం ఎంత కీర్తించినా, మరెంత పొగిడినా తక్కువేనన్నారు. ఈ విజయ భేరిలో నినదించిన ప్రతి సైనికునికి, వారి కుటుంబాలకు భారత జాతి సర్వదా రుణపడి ఉంటుందని, అమరుల త్యాగాలను స్మరించుకుంటూనే ఉంటుందని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం

బుధవారం 27-07-2022

## కలవరపెడుతోన్న మంకీపాక్స్

చాలామంది అనుకుంటున్నట్లుగా మంకీపాక్స్ అనేది కొత్త జబ్బు కాదు. దీన్ని మొదటిసారిగా 1970ల్లోనే గుర్తించారు. ఈ వైరస్ కోతులు, రాడెంట్స్ ద్వారా వస్తుంది. అయితే ఇది మనుషులతో మరీ దగ్గరగా మసలితేనే మనుషుల్లో విస్తరిస్తున్నదని ప్రస్తుతం భారత్‌లో ఉన్న కేసుల ద్వారా డాక్టర్లు తెలుసుకున్నా రు. మన దేశంలో మంకీపాక్స్ మొదటి కేసు ఈ నెలలోనే కేరళలో గుర్తించారు. మంకీపాక్స్ మశూచితో పోలిస్తే సారూప్యత కలిగి ఉంది. కానీ తేలికపాటి లక్షణాలను కలిగి ఉంటుంది, ఇది కూడా ఒక అంటువ్యాధి. కోవిడ్-19 యితర అంటువ్యాధుల వలె మంకీపాక్స్ గాలిసోకితే విస్తరించే వ్యాధి కాదు. కానీ ప్రమాదకరమే. దీని పూర్తి లక్షణాలు బయటపడేసరికి ఒకటి రెండు వారాల సమయం పడుతుంది. సుమారు 75 దేశాల్లో ఈ అంటువ్యాధి లక్షణాలు కనిపించాయి. ఇప్పటివరకూ ఆఫ్రికాలో నలుగురు మరణించినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూ హెచ్ ఓ ప్రకటించింది. ఇది ఎంతో త్వరగానే ఇతరులకు విస్తరిస్తుంది. కానీ దీన్ని గుర్తించే పరీక్షలు కష్టసాధ్యం. భారతదేశంలో ఇప్పటివరకూ అయిదు కేసులు నమోదయినప్పటికీ, పరీక్షలకు ఇంకా వీలు కలగడం లేదుగనుక ఈ కేసు ల సంఖ్య పెరగవచ్చని ఆరోగ్యశాఖ అధికారులు ఆందోళనపడుతున్నారు. పేరు విచిత్రంగా ఉండడంతో, కేవలం కోతుల ద్వారానే ఈ అంటువ్యాధి విస్తరిస్తుందని, మనుషులతో ఇది విస్తరించదన్న అభిప్రాయం ప్రచారంలో ఉంది. అయితే ఇది ఇప్పుడే తెలిసింది గనుక దీన్ని గురించిన ప్రచారాలతో ఖంగారుపడవద్దని ఆరోగ్యశాఖ హెచ్చిస్తోంది. ఎలాంటి వదంతులు నమ్మవద్దని అధికారులు అంటున్నారు. కోతులు, యితర జంతువులకు దూరంగా ఉండడం వల్ల ఇది రాకుండా జాగ్ర త్త పడవచ్చన్న విషయంలో వాస్తవం లేదని అంటున్నారు. మంకీపాక్స్ వచ్చినవారు, ఆ లక్షణాలు ఉన్నవారితో సన్నిహితంగా ఉండేవారికి అది విస్తరించే అవకాశం ఉంది తప్ప కోవిడ్‌వలె విస్తరిం చదని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. మంకీపాక్స్‌తో బాధపడుతున్నవారికి సన్నిహితంగా, దూరంగా ఉన్న వారు కూడా సరయిన ఆరోగ్య జాగ్ర త్తలు పాటించాల్సి ఉంటుది. అయితే దీన్ని గురించి తప్పుడు సమా చారం, అర్ధంలేని పుకార్లతోనే ప్రపంచ దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయని అంటున్నారు. శరీరం మీద ఎర్రటి మచ్చలు ఏర్ప డడం, నోటినుంచి ఉమ్మిరావడం, నోటి నుంచి తుప్పర్లు పడడం వాటి వల్ల ఈ మంకీపాక్స్ త్వరగా విస్తరించే అవకాశం ఉంది. శరీరం మీద ఎర్రటి మచ్చలు, పుండ్లు వంటివి ఏర్పడితే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టరును సంప్ర దించడమే మేలు. మంకీపాక్స్ అనుమానాలు ఉంటే త్వరపడి చికిత్సకు డాక్టర్లను సంప్రదించాలి. లేకుం టే మంకీపాక్స్ కూడా తీవ్రరూపం దాల్చే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికే కోవిడ్-19తో ప్రపంచ దేశాల ప్రజలు ఆరోగ్య, సామాజిక పరిస్థితులు దెబ్బతిని ఎంతో నష్టపోయారు. ఈ అనుభవంతో మంకీపాక్స్‌ను ముందే గ్రహించి తగు జాగ్రత్తలు పాటించడం ఎంతయినా అవసరం. మంకీపాక్స్ వచ్చిందనే అనుమానాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్యసంస్థ ప్రకటించింది. అవే మంటే.. మంకీపాక్స్ లక్షణాలు ఉన్న వ్యక్తికి దూరంగా ఉండాలి. అంటే ఎవరన్నా ఎర్రటి మచ్చలు, దుర దలు వంటివి ఉంటే వారికి దూరంగా ఉండాలి. రోగ నిరోధక శక్తి బలంగా ఉంటే పలు వ్యాధులు దూరమవుతాయి. ఈక్రమంలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉన్నవారు మంకీపాక్స్‌ను చాలా వరకు అధిగమించవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అయితే, దీనికి ఎటువంటి రుజువులు లేవు. కానీ విటమిన్ సి ద్వారా రోగనిరోధక శక్తిని మెరుగుపర్చుకోవచ్చు. ఇందుకోసం నిమ్మకాయ వంటి పుల్లగా ఉండే సిట్రస్ ఫుడ్స్‌ను బాగా తీసుకోవాలి. ఒకవేళ పుల్లటి పండ్లు నచ్చకపోతే బొప్పాయి వంటి తీపి పండ్లను కూడా తీసుకోవచ్చు. ఇవి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. ఆయుర్వేదంలో తులసి ఆకులకు ఎంతో ప్రాధాన్యముంది. ఎందుకంటే అవి ఔషధంగా పనిచేస్తాయి. తులసి ఆకులతో చేసిన పానియాలు, టీ తీసుకోవడం ద్వారా ఇమ్యూనిటీని వేగంగా పెంచుకోవచ్చు. ఇది వివిధ వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పిస్తుంది. వంటల్లో రుచిని పెంచే పుదీనాను ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. ఇది అనేక వ్యాధులకు నివారిణగా పరిగణిస్తారు. ముఖ్యంగా ఉదర సంబంధిత వ్యాధులకు ఇది మంచి ఆహారం. దీనితో తయారు చేసిన వాటిని తినడం వల్ల కండరాలలోని ఒత్తిడి తొలగిపోతుంది. అలాగే ఆస్తమా వంటి తీవ్రమైన వ్యాధుల నుండి కూడా మిమ్మల్ని రక్షిస్తుంది. కావాలంటే పుదీనాతో తయారుచేసిన హెర్బల్ టీని తాగొచ్చు. ఇది దగ్గు, జలుబు సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఆ అనుమానాలు ఉన్న వ్యక్తి కి సంబంధించిన ఏ వస్తు వులనూ పంచుకోరాదు. కోవిడ్-19 సమయంలో ఉపయోగించినట్టు శానిటైజర్‌ను నిత్యం ఉపయోగించాలి. ప్రస్తుతం ఈ జాగ్రత్తలను పాటించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# కన్నీటి వరదలు...



ఏలూరు, కాకినాడ, జూలై 26, అడుగు తీసి అడుగువేయలేనంత బురద.. ఏ రహదారి చూసిన బురదమయమే.. వరదకు కొట్టుకొచ్చిన దుంగలు.. కరెంటు తీగలపై బట్టలు..సగం కూలిపోయిన ఇళ్లు..ఏ ఒక్కరిని కదిలించిన కన్నీటి కష్టాలే.. గోదావరి శాంతించడంతో బయటపడుతున్న లంకలోని పరిస్థితి ఇది. ఇళ్లల్లోకి చేరిన మట్టిని తొలగించుకునే పనిలో బాధితులు నిమగమయ్యారు. పూర్తిగా బురదమయమైన వస్తువులను ఒక్కొక్కటిగా శుభ్రం చేసుకుంటున్నారు. ఏ వస్తువు కింద ఏ పాము దాగి ఉందోనని భయం భయంగా శుభ్రం చేస్తున్నారు. కాకినాడ జిల్లా నుంచి వచ్చిన శానిటేషన్ సిబ్బంది వీధుల్లోని బురదను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. ఆలమూరు మండలం బడుగువాని లంక, ఐ.పోలవరం మండలం ఎదుర్లంక, పి.గన్నవరం మండలం లంకల గన్నవరం, రాజోలు మండలం రాజోలు లంకలో ఇళ్లకు ఎక్కువగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక సమాచారం. ఈ ప్రాంతాల్లో సుమారు 120 ఇళ్ల వరకూ నష్టం వాటిల్లినట్టు అంచనా.ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద బాధితుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వరద ముంపు తగ్గడంతో గ్రామాలకు చేరుతున్న ప్రజలు అక్కడి పరిస్థితులను చూసి పెడుతున్న రోదనలు మిన్నంటుతున్నాయి. వరద ధాటికి ఇళ్లు కుప్పకూలడంతో నిలువనీడ లేకుండాపోయారు. ఇళ్లలోని సామాన్లు మొత్తం దెబ్బతినడంతో సర్వంకోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలంటూ బాధితులు ఘొల్లుమంటున్నారు. ఈ రెండు మండలాల్లోని 125 గ్రామాలు తీవ్ర వరద ఉధృతికి గురయ్యాయి. వీటిలో అత్యధిక గ్రామాల్లో ఇంటి పైకప్పులు సైతం మునిగిపోయాయి. సామాన్లన్నీ ఇళ్లలోనే వదిలి కట్టుబట్టలతో 20,248 కుటుంబాలు పునరావాస కాలనీలకు చేరాయి. వరద తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాలన్నీ వరద ముంపు నుంచి బయటపడుతున్నాయి. గ్రామాలకు వెళ్తున్న ప్రజలు అక్కడి పరిస్థితి చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. రోడ్లపై మోకాళ్లలోతు బురద, కుప్పకూలిన తమ ఇళ్లను చూసి రోదిస్తున్నారు. ఇంట్లో సామాన్లు సైతం ఎందుకూ పనికిరాని స్థితికి చేరాయి. మోటారు సైకిళ్లు, టివిలు, ఫ్రిజ్‌లు, విద్యుత్తు మీటర్లు, పరుపులు ఇలా ఏఒక్క సామగ్రి పనికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. కుక్కునూరులోని రజక బజార్‌లో 120 ఇళ్లకుగానూ పది ఇళ్లు మాత్రమే మిగిలాయి. మిగిలిన ఇళ్లన్నీ కుప్పకూలిపోయాయి. బెస్తగూడెం ఎస్‌సి కాలనీలో సైతం పెద్ద ఎత్తున ఇళ్లు పడిపోయాయి. వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము, కొయిదా, కట్కూరు గ్రామాల్లోనూ 90 శాతానికిపైగా ఇళ్లు పడిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రస్తుత ధరల నేపథ్యంలో చిన్నపాటి తాటాకు ఇంటిని నిర్మించాలన్నా రూ.50 వేలకుపైగా ఖర్చవుతుంది. రోడ్లపై పెద్ద ఎత్తున బురద పేరుకుపోవంతో గ్రామాల్లోకి వెళ్లే పరిస్థితి ఇప్పటికీ లేకుండా ఉంది. కుక్కునూరులోని జూనియర్ కాలేజీ, కస్తూబా బాలికల హాస్టల్ పునరావాస కేంద్రాల్లోని బాధితులను ఖాళీ చేసి వెళ్లాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఇళ్లు కుప్పకూలిపోవడంతో గ్రామాల్లోకి వెళ్లి ఎక్కడ ఉండాలో తెలియని దిక్కుతోచని దుస్థితిలో బాధితులు ఉన్నారు. రేకుల షెడ్లు, పెంకుటిళ్లు, డబ్బాలు వంటి ఇళ్లు కూలకపోయినా వరద నీటికి నానిపోవడంతో గోడలన్నీ దెబ్బతిన్నాయి. ఇళ్లలో భారీగా పేరుకుపోయిన బురదను తొలగించేందుకు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చయ్యే పరిస్థితి ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుప్పకూలిన ఇళ్ల ఎన్యుమరేషన్ వెంటనే పూర్తి చేసి నష్టపరిహారం అందిస్తేనే వరద బాధితులకు ఊరట లభిస్తుంది. లేదంటే పిల్లలతో అంతా రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న ఇళ్లకు పరిహారంపై ప్రభుత్వం ఇప్పటివరకూ నోరు మెదపలేదు.

# హోర్డింగ్స్ వార్

గుంటూరు, జూలై 26, గుంటూరు నగరపాలక సంస్థలో భారీగా వెలుగుచూస్తున్న హోర్డింగ్‌లు అధికారులు.. మున్సిపల్ కార్పొరేటర్ల మధ్య చిచ్చుపెట్టాయి. 12 ఏళ్లు అధికారుల పాలన సాగడంతో.. నగరంలో ఇష్టానుసారం హోర్డింగులు ఏర్పాటయ్యాయి. ఆ సమయంలో పెద్దగా చర్చ సాగింది లేదు. కానీ.. ఎన్నికలు జరిగి.. కొత్త కౌన్సిల్ వచ్చాక.. వాటికి సంబంధించిన ప్రకంపనలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ కార్పొరేటర్లు గతంలో జరిగిన అక్రమాల పుట్టను వెలికి తీస్తున్నారు. అలా హోర్డింగ్‌లపై ఫోకస్ పెట్టారట.గుంటూరు నగరంలో అక్రమ హోర్డింగ్‌లు ఎన్ని ఉన్నాయి? వాటి ద్వారా మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎంత రావాలి? ఎంత వస్తోంది? ఎన్ని నిధులు పక్కదారి పట్టాయి? ఇలా చాలా అంశాలను వెలికి తీశారట వైసీపీ కార్పొరేటర్లు. హోర్డింగ్‌ల ద్వారానే కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని తెలుసుకుని అంతా ఆశ్చర్యపోయారట. ఆ బిజినెస్ ఏదో మనమే చేస్తే పోలా అని అందరికీ ఆశ పుట్టిందట. వెంటనే అధికార పార్టీ నేతల ముందు ఆ ప్రతిపాదన ఉంచారట కార్పొరేటర్లు. వాటి నిర్వహణ బాధ్యత కార్పొరేషన్ తీసుకుని.. బాధ్యతలు కార్పొరేటర్లకు అప్పగిస్తే.. ప్రైవేట్ కంపెనీలతోపాటు? ప్రభుత్వ పథకాలను కూడా ప్రచారం చేయొచ్చని సెలవిచ్చారట. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ మనోహర్‌తోపాటు కమిషనర్‌కు ఈ విషయం చెప్పారు. అయితే నిర్వహణ విషయంలో ఎక్కడా అధికారుల పాత్ర ఉండొద్దని కండీషన్ పెట్టారట.ఇప్పటికే చాలా మంది అధికారులు హోర్డింగ్‌ల ద్వారా కోట్ల రూపాయలు వెనకేసుకున్నారనేది కార్పొరేటర్ల ఆరోపణ. అధికారిక లెక్కల ప్రకారం గుంటూరులో దాదాపు 900ల హోర్డింగ్‌లు ఉన్నాయి. అనధికారికంగా వీటి సంఖ్య 8 వేల 500 వరకు ఉంటుందని సమాచారం. ఆ లెక్కలు తెలిశాక వైసీపీ కార్పొరేటర్లు కళ్లు తేలేసారట. లెక్కల్లో చూపించకుండా ఉన్న హోర్డింగ్‌ల ద్వారా వచ్చిన ఆదాయం ఎవరు మింగేశారో కూపీ లాగుతున్నారట. గడిచిన పదేళ్ల లెక్క తీసుకుంటే కోట్లకు కోట్లే వెనకేసుకుని ఉంటారని అనుమానిస్తున్నారట. అధికారులు.. ఆ విభాగంలో పనిచేస్తున్న.. పదేళ్లుగా పనిచేసిన సిబ్బంది లెక్కలు దగ్గర పెట్టుకుని ఎవరికెంత వాటా వెళ్లిందో టేబుల్స్ వేస్తున్నారట. చివరకు హోర్డింగ్‌ల ఎత్తు విషయంలోనూ కొందరు ఆఫీసర్లు, సిబ్బంది జిమ్మిక్కులు చేశారని గుర్తించారట.మొత్తానికి తేనెతుట్టెను కదిపినట్టు సంతోష పడుతున్నారు కార్పొరేటర్లు. వాటిని పక్కాగా నిర్వహిస్తే.. కార్పొరేషన్‌కు నిధులు.. తమకూ మిగులు అనేట్టుగా కొందరు నేతల ఆలోచనలు ఉన్నాయట. పైకి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అని చెబుతున్నా.. లీడర్ల తీరు చూస్తే అలా లేదన్నది సిబ్బంది మాట. అప్పుడు మీరు తిన్నారు.. ఇప్పుడు మా వంతు అన్నట్టు కొందరి వైఖరి ఉందని చెవులు కొరుక్కుంటున్నారు. మొత్తానికి నగరంలో బొమ్మ బొమ్మకో రేటు కట్టి కొత్త పంచాయితీకి తెరతీస్తారేమో చూడాలి.

# గోదావరి జిల్లాల్లో తమ్ముళ్ల పక్కా ప్లాన్

రాజమండ్రి, జూలై 26,రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్న ఉమ్మడి తూర్పుగోదావరి చాలా కీలకం. ఈ జిల్లాలో ఎక్కువ సీట్లు వచ్చిన వారు అధికారం కైవశం చేసుకుంటారు అనేది ఒక సెంటిమెంట్. జిల్లాలో మొత్తం మూడు పార్లమెంటు నియోజకవర్గాలు 19 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ టిడిపి ఓడిపోయింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు.. రాజకీయ ఎత్తుగడలతో రెండుచోట్ల పోటీ చేసిన వారు పార్టీ దూరం అయ్యారు. కాకినాడ నుంచి పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ వైసీపీ కండువా కప్పేసుకున్నారు. రాజమండ్రి బరిలో నిలిచిన మాగంటి రూప ఆ తర్వాత అడ్రస్ లేరన్నది తెలుగు తమ్ముళ్ల మాట. అమలాపురంలో బాలయోగి కుమారుడు హరీష్ ఓడిన తర్వాత నియోజకవర్గానికి రావడం లేదట. వచ్చినా అమలాపురం గడప దాటి వెళ్లడం లేదన్నది కేడర్ చెప్పేమాట. ఎక్కువగా వైజాగ్‌లోనే ఉంటున్నారట హరీష్.రాజమండ్రిలో ఓడిన తర్వాత మాగంటి రూప సైతం ఇటు రాలేదట. ఇటీవల కాలంలో ఆమె మామ మురళీమోహన్ చేస్తున్న కామెంట్స్‌తో.. ఆ కుటుంబం క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తుందా లేదో అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు పార్టీ నేతలు. అసలు నాయకులకే లేనప్పుడు మనకెందుకు అని టీడీపీ కేడర్ సైతం జెండా పక్కన పడేసింది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. అభ్యర్థుల బలాబలాలపై చర్చ నడుస్తోంది. అయితే ఈ మూడు లోక్‌సభ అభ్యర్థులపై టీడీపీ సీరియస్‌గా తీసుకున్నట్టు కనిపించడం లేదు. చూద్దాం.. చేద్దాం.. అనే మాటలే వినిపిస్తున్నాయట.గత నెలలో జరిగిన టిడిపి రాష్ట్రస్థాయి సమావేశాల్లో జిల్లాకు చెందిన నేతలు అభ్యర్థుల అంశాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారట. ఇప్పటి నుంచే ఎస్టాబ్లిష్ కాకపోతే తర్వాత ఇబ్బందులు వస్తాయని డైరెక్ట్‌గానే చెప్పేశారట. అయితే అభ్యర్థుల ఎంపిక ఆషామాషీ కాదని.. ఆర్థిక అంగ బలాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని బదులిచ్చారట చంద్రబాబు. ఆ సమాధానం రుచించలేదట నాయకులకు. ఎమ్మెల్యేలు.. నియోజకవర్గాల ఇంఛార్జులు.. ఇంకా ఎన్నాళ్లు సాగదీస్తారని ప్రశ్నిస్తున్నారట. అధికార పార్టీ క్లారిటీగా దూసుకుపోతుంటే.. పాత పద్ధతులేంటి అని అసహనం వ్యక్తం చేస్తున్నారట నాయకులు.రాష్ట్రంలో అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరిగినప్పుడు లోక్‌సభ అభ్యర్థి ప్రభావం కచ్చితంగా తమపై ఉంటుందని నేతలు చెబుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కాకినాడలో 25 వేలు.. అమలా పురంలో 45 వేలు ఓట్ల తేడాతో టీడీపీ ఓడిపోయింది. అప్పుడు కూడా చివరి వరకు నాన్చడం వల్లే నష్టపోయామన్నది టీడీపీ నేతల చెప్పే మాట. క్లారిటీ లేక క్రాస్ ఓటింగ్ జరిగిందనేది వారి అభిప్రాయం. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో పసుపు పార్టీకి ప్రణాళిక లేదనే టాక్ నడుస్తుంది. అయ్యవారు వచ్చేలోపు ఉన్నవాళ్లు చేజారే ప్రమాదం ఉందని చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ ఎపిసోడ్ కి టీడీపీ అధిష్ఠానం ఏవిధంగా ఎండ్‌కార్డ్ వేస్తుందో చూడాలి.

# అరటిపండ్లు డజను 80 పైనే



కాకినాడ, జూలై 26, అమ్మో... అరటిపండు!.. ఆ మాటెత్తితే సామాన్యుడు ఉలిక్కిపడుతున్నాడు. మొన్నటివరకు సామాన్యుడి పండుగా పేరుగాంచిన అరటి ధర నేడు చుక్కలనంటుతోంది. పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు, పూజల్లో అరటి పండు ప్రధానపాత్ర వహిస్తోంది. విందు భోజనాల్లో ఎన్ని రకాలు వడ్డించినా చివరగా అరటిపండు లేకపోతే తృప్తిగా ఉండదంటారు.అలాంటి పండు ధర క్రమంగా రెండు నెలలుగా కొండెక్కి కూర్చొంది. డజన్ రూ. 20గా ఉన్న పండ్లు నేడు రూ. 80 లకు పైగా అమ్ముతున్నారు. కాస్త పెద్ద సైజు పండైతే రూ. 100 వెచ్చించాల్సి వస్తోంది. ప్రస్తుతం వివాహ ముహూర్తాలు, శుభకార్యాలు లేకపోయినా అరటిపండ్ల ధర ఈ స్థాయిలో ఉంటే ఈనెల 29వ తేది నుంచి శ్రావణమాసం రావడం, నెలాఖరు వరకు వరుస ముహూర్తాలు ఉండడంతో మరింత ప్రియం అయ్యే అవకాశం ఉందిఏప్రిల్ వరకు డజన్ రూ. 20గా ఇంటింటికి తిరిగిన అరటిపండ్ల వ్యాపారులు మే నుంచి క్రమంగా కనుమరుగయ్యారు. కేవలం కడప నగరంలోనే 400కు పైగా ఉన్న అరటిపండ్లు విక్రయించే బండ్లు నేడు నాలుగో శాతానికి పడిపోయాయి. ముఖ్యంగా కూడళ్లలో అరటి పండ్ల వ్యాపారాలే అధికంగా కనిపించేవి. ప్రస్తుతం బండ్లు కిక్కిరేసి ఉండే పాత బస్టాండు లాంటి ప్రాంతంలో కూడా నాలుగైదుకు మించి అరటిపండ్ల బండ్లు కనిపించడం లేదు. కొనుగోలుదారుడు తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా కూడా పండ్లలో నాణ్యత కనిపించదు.ఇంతకుమించి మంచి సరుకు రావడం లేదని, అసలు తోటల నుంచి దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, ఒకటి, రెండు మినహా సాగు, తోటలు తగ్గాయని విక్రయదారుడు పేర్కొంటున్నారు. ఈ పాతికేళ్లలో రూ.50కి మించి అరటిపండ్ల ధర లేదని, ఇప్పుడు ఒక్కసారిగా రూ. 80లుగా తిష్ట వేసుకుని కూర్చొవడం తమకు కూడా ఇబ్బందిగా ఉందని, రోజూ 200?400 దజన్ల పండ్లు అమ్మే తాము ఇప్పుడు 25 దజన్లు కూడా అమ్మలేక పోతున్నామని, అమ్ముదామన్నా బండి నిండుగా కూడా సరుకు లభించడం లేదని వాపోతున్నారు.

# భారీగా తగ్గిన ఖరీఫ్

విజయవాడ, జూలై 26, ఈ ఏడాది ఖరీఫ్ సాగులో అంతగా ఉత్సాహం కనిపించడం లేదు. జులై నాల్గవ వారం వచ్చినా సేద్యం పుంజుకోలేదు. మెట్ట, మాగాణి అనే తేడా లేకుండా దాదాపు అన్ని పంటల సాగు నెమ్మదించింది. ఒక్క పత్తి మినహా తతిమ్మా పంటలన్నీ ఇప్ప టికి సాగు కావాల్సిన దాని కంటే తక్కువగా సాగ య్యాయి. అంతేకాదు నిరుడు, ముందటేడు కంటే కూడా తక్కువ విస్తీర్ణంలో వేశారని ప్రభుత్వ గణాం కాలు తెలియజేస్తున్నాయి. వాతావరణం అనుకూలం గా ఉన్నా, వర్షాలు ఒక మేరకు బానే కురిసినా, ప్రధానంగా గోదావరి, కృష్ణా డెల్టా కాల్వలకు ముందుగానే సాగునీరు వదిలినా పంటల సాగులో పురోగతి లేకపోవడం గమనార్హం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 36.82 లక్షల హెక్టార్లు కాగా జులై 20 వరకు అన్ని పంటలూ కలుపుకొని 13.04 లక్షల హెక్టార్లలో పంటలు వేయాలి. కానీ 10.16 లక్షల హెక్టార్లలోనే వేశారు. దాదాపు మూడు లక్షల హెక్టార్ల (22 శాతం) తగ్గుదల కనిపిస్తోంది. ఇదే సమయానికి ముందటేడు 15.67 లక్షల హెక్టార్లలో, నిరుడు 10.07 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు.వరి నాట్లు ఇప్పటికి 4.37 లక్షల హెక్టార్లలో పడాల్సి ఉండగా 3.02 లక్షల హెక్టార్లలోనే పడ్డాయి. నాట్లు 1.35 లక్షల హెక్టార్లలో (31 శాతం) తగ్గాయి. ముందటేడు ఇదే సమయానికి 4.09 లక్షల హెక్టార్ల లో, నిరుడు 3.70 లక్షల హెక్టార్లలో వరి నాట్లు పడ్డాయి. ముతక ధాన్యాలైన జొన్నలు, మొక్కజొన్న, సజ్జ, రాగి, తృణధాన్యాల సాగులో 21 శాతం తగ్గు దల ఉంది. కంది, పెసర, మినుము, ఉలవలతో సహా అన్ని పప్పుధాన్యాలూ 27 శాతం తగ్గాయి. మొత్తం ఆహారధాన్యాలు ఇప్పటికి 5.92 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 4.11 లక్షల హెక్టార్లలోనే సాగయ్యాయి. సాగు 31 శాతం తగ్గింది.మొత్తం నూనెగింజల సాగులో 24 శాతం తగ్గుదల ఉంది. రాయలసీమలో కాస్త ముందస్తుగా సాగు చేసే వేరుశనగ సాగులో సైతం గణనీయంగా తగ్గుదల కనిపిస్తోంది. సాధారణ సాగులో 31 శాతం లోటు నెలకొంది. ఇదిలా ఉండగా వాణిజ్య పత్తి సాగు దూకుడు మీదుంది. ఇప్పటికి సాగు కావాల్సిన దాని కంటే ఐదు శాతం ఎక్కువ సాగైంది. సీజన్ మొదట్లో వర్షాలు మొరాయించినా రెండు వారాల నుండి రుతు పవనాలు, అల్పపీడనాల వలన వానలు బానే కురి శాయి. గోదావరి వరదలు, భారీ వర్షాలకు అక్కడక్కడ వరి నాట్లు మునిగి దెబ్బ తిన్నాయి. వేసిన వివిధ పంటల విత్తనాలు కొట్టుకుపోయాయి. కాగా మెట్ట ప్రాంతాల్లో ఈ వర్షాలు సాగుకు ఉపకరించాయి.

# నియోజకవర్గాల వారీగా భేటీలు

విజయవాడ, జూలై 26,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎలాగైనా రాష్ట్రంలో రెండో సారి అధికార పగ్గాలు చేపట్టాలన్న పట్టుదలతో ఉన్నారు. ఆయన ప్రతి మాటా, ప్రతి కదలికా, ప్రతి చర్యా, ప్రతి ప్రసంగం ఆ విషయాన్నే చెబుతుంది.అయితే వాస్తవ పరిస్థితులు అందుకు అనుగుణంగా ఉన్నాయా అంటే మాత్రం కనీసం పార్టీ శ్రేణుల నుంచి కూడా ఔననే సమాధానం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జగన్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదు. అందులో వైసీపీ వాళ్లు మినహాయింపు ఎంత మాత్రం కాదు. నియోజకవర్గంలో తిష్ట వేసిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేద్దామని ప్రయత్నించే ఎమ్మెల్యేలకు ఆయన దర్శనమే దొరకదు. ఈ మూడేళ్ల కాలంలో ఒక్కసారంటే ఒక్క సారి కూడా సీఎంను కలుసుకోవడానికి కనీస అవకాశం దొరకని ఎమ్మెల్యేల సంఖ్య వందకు పైగానే ఉంటుందని వైసీపీ శ్రేణులే చెబుతున్నాయి. జగన్ చెబుతున్నట్లు వచ్చే నెల నుంచి నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించడం జరిగే పని కాదని ఆ పార్టీ వారే పెదవి విరుస్తున్నారు.నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తే ముందుగా చర్చకు వచ్చేది ఆ నియోజకవర్గంలోని సమస్యలేనని అంటున్నారు. అయితే ఆ సమస్యలను అడ్రెస్ చేసే తీరిక కానీ, ఓపిక కానీ జగన్ కు లేవనడానికి గడప గడపకూలో ఎదురౌతున్న సమస్యలను జగన్ కు తెలియజెప్పడానికి యత్నించిన ఎమ్మెల్యేలకు ఆయన విసుగు, చిరాకు ఎదురైన సంగతిని పార్టీ శ్రేణులు గుర్తు చేస్తున్నరు. రోజుకు ఒక నియోజకవర్గాన్ని ఎంచుకుని ఆ నియోజకవర్గానికి చెందిన ఓ 50మంది ముఖ్యులతో సమావేశమైనా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలనూ కవర్ చేయాలంటే కనీసం ఆరు నెలలు పడుతుందని చెబుతున్నారు. ఒక వైపు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం, మరో వైపు నియోజకవర్గాల వారీగా సమావేశాలు అంటే ఎమ్మెల్యేలు రెంటినీ అవాయిడ్ చేసే అవకావం ఉందని పార్టీ శ్రేణులే అంటున్నాయి.నియోజకవర్గాల వారీ సమావేశాలలో అనివార్యంగా ప్రజా సమస్యలే ముందుగా చర్చకు వస్తాయి. అవి చర్చకు రాగానే వాటి పరిష్కారాన్ని సీఎం సూచించాలి. అలా సూచించడానికైనా ముందుగా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయాలి. ఏ విధంగా చూసినా ఇప్పుడు నియోజకవర్గాలలో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించే పరిస్థితే లేదు. వీటన్నిటికీ మించి తమ ప్రభుత్వంపై నమ్మకంతో పార్టీ నేతలకు చేసిన పనులకు ఇన్నేళ్లుగా బిల్లులు రాలేదు. ఆ బిల్లులు చెల్లించకుండా జగన్ మాత్రం ఏ ముఖం పెట్టుకుని వారితో సమావేశం కాగలరు అని పార్టీ వర్గాలే ప్రశ్నిస్తున్నాయి.చివరాఖరికి ఇటీవలి వరదల సమయంలో ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తీసుకు వచ్చిన పడవలకు డీజిల్ డబ్బులు కూడా ఇవ్వలేని ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు వడుదల చేస్తుందని ఆశించడం దురాశే అవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్న నేపథ్యంలో జగన్ చెప్పినట్లుగా వచ్చే నెలనుంచి నియోజకవర్గాల వారీ సమావేశాలు జరిగే అవకాశాలు దాదాపు మృగ్యమనే అంటున్నాయి పార్టీ శ్రేణులు.

# అటు నుంచి నరుక్కొస్తున్న సీబీఐ

కడప, జూలై 26,వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు రాష్ట్ర వ్యాప్తంగానే కాదు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో తిరిగినన్ని, తిరుగుతున్నన్ని మలుపులు గతంలో ఏ కేసులోనూ జరిగి ఉండక పోవచ్చు. 2019 ఎన్నికలకు ముందు ఈ హత్య జరిగిందితన సొంత ఇంట్లో వివేకా హత్యకు గురయ్యారు. అప్పుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి. వివేకా అన్న కొడుకు వైఎస్ జగన్ విపక్ష నేత. వివేకా మరణించారన్న వార్త బయటకు రాగానే ఆయన గుండె పోటుతో మరణించారంటూ జగన్, ఆయన అనుచరులు విజయసాయి తదితరులంతా ఒకరి తరువాత ఒకరు ప్రకటనలు గుప్పించేశారు. గంటల వ్యవధిలోనే వివేకా గుండె పోటుతో మరణించలేదు... ఆయన హత్యకు గురయ్యారన్నది వెల్లడైంది. అంతే జగన్ తదితరులందరి స్వరం మారిపోయింది. చంద్రబాబు, లోకేష్ ల హస్తం ఈ హత్య వెనుక ఉందంటూ విమర్శలు గుప్పించి.. ఎన్నికలలో సానుభూతి పవనాల కోసం తమ వంతు ప్రయత్నం చేసేశారు. ఆయన హత్యపై సీబీఐ విచారణకు స్వయంగా జగన్ డిమాండ్ చేశారు.సరే ఆ తరువాత జగన్ ఎన్నికలలో విజయం సాధించారు. ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తరువాత తన సొంత బాబాయ్ వివేకా హత్య కేసు విచారణను నీరుగార్చే ప్రయత్నాలు ప్రారంభించారు. బాబాయ్ హత్యపై సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన ఆయనే అధికారంలోకి వచ్చాకా సీబీఐ విచారణ అవసరం లేదని అన్నారు. అయితే వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి మాత్రం తన తండ్రి హత్య కేసులో సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు అందుకు అంగీకరించి కేసును సీబీఐకి అప్పగించింది. అయితే ఏపీలో సీబీఐ అయినా, అంత కంటే గోప్ప సంస్థైనా సరే చేయగలిగేదీ ఏదీ ఉండదని జగన్ సర్కార్ హయాంలో నిర్ద్వంద్వంగా రుజువైపోయింది. కేసు దర్యాపు వేగంగా జరుగుతున్న సమయంలో సీబీఐకి బెదరింపులు వచ్చాయి. సీబీఐ అధికారులపైనే ప్రైవేటు కేసులు దాఖలయ్యాయి. వీటన్నిటి వెనుకా ఉన్నది వివేకా హత్య విచారణ సజావుగా సాగకుండా ఆపే యత్నమే. దీంతో గత కొంత కాలంగా సీబీఐ ఈ హత్య కేసు విషయంలో సైలెంట్టైపోయింది. అంతకు ముందు ఈ హత్య కేసులో అరెస్టయిన ఎవన్ ముద్దాయి ఎర్రగంగిరెడ్డి బెయిలు రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టేసింది. అప్పటికే వివేకా హత్య కేసులో అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న సీబీఐ విచారణ విషయంలో హఠాత్తుగా మౌనం వహించింది. ఈ క్రమంలోనే ఈ కేసులో కొందరు సాక్షులు అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ పరిస్థితుల్లో గత కొంత కాలంగా మౌనంగా ఉన్న సీబీఐ హఠాత్తుగా ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దు కోరుతూ సుప్రీంను ఆశ్రయించింది. ఎర్రగంగిరెడ్డి బెయిలుపై ఉంటే సాక్షులను బెదరించే, ప్రభావితం చేసే అవకాశాలున్నాయని ఆ పిటిషన్ లో పేర్కొంది. దీంతో ఇక వివేకా హత్య కేసు విచారణ వేగవంతం య్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేసు విచారణలో ఎర్రగంగిరెడ్డి బెయిలు పిటిషన్ పై సుప్రీం నిర్ణయం అత్యంత కీలకం కానున్నద.

# సముద్రంలో వివాహిత గల్లంతు



విశాఖపట్నంవిశాఖ ఆర్కే బీచ్ వద్ద నిన్న గల్లంతు అయిన వివాహిత సాయి ప్రియ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నా యి. పెళ్లిరోజు కావడంతో భర్త శ్రీనివాసుతో కలిసి సాయి ప్రియ నిన్న ఆర్కే బీచ్ కు వెళ్లారు. సాయంత్రం 6 గంటల వరకు బీచ్ ఒడ్డున భార్యాభర్తలు కలసి ఉన్నారు. అయితే సాయి ప్రియ భర్తకి ఫోన్ లో మెసేజ్ రావడంతో వెనక్కొచ్చి మెసేజ్ చూసుకొని తిరిగి చూసేసరికి సాయి ప్రియ కనబడలేదు. బీచ్ లో కెరటాలకు కొట్టుకుపోయిందని భావించి పోలీసులకు పిర్యాదు చేశారు. భార్య కొట్టుకుపోవడం తాను చూడలేదని భర్త శ్రీనివాసు అంటున్నారు. మెసేజ్ చూసి వచ్చే సరికి సాయి ప్రియ కనబడలేదని చెబుతున్నారు. గజ ఈతగాళ్ళ సాయంతో బీచ్ లో గాలించగా ఆచుకీ లభ్యం కాలేదు.అయితే, సాయి ప్రియ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివాహిత అదృశ్యంపై పలు అనుమానాలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి, విచారిస్తున్నారు. అసలు బీచ్ లో కొట్టుకుపోయిందా? లేదా మరేదన్న జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.

# దున్నేందుకు సమయమిదే

**స్వప్నికా రెడ్డి. అగ్రికల్చర్ ఎఓ**

నంద్యాల భూమిలో పచ్చిరొట్ట కలియ దున్నే సమయమిదేనని మండల ఏవో స్వప్నికా రెడ్డి తెలిపారు. జులై నుంచి వరి, ఆగస్టు నుంచి మిరప సాగు ఆరంభిస్తారు. పచ్చి రొట్ట ఎరువుల్లో జీలుగ,, పిల్లిపెసర, ప్రధానమైనవి. అవి సూక్ష్మపోషకాలైన జింక్, మాంగనీస్, రాగి వంటి ధాతువులను భూమికి అందిస్తాయి. పంట ఆరోగ్యంగా పెరిగి నాణ్యమైన దిగుబడి ఇచ్చేందుకు దోహదపడతాయి. తొలకరి ఆరంభంలో విత్తనాలు చల్లాలి. మొక్కలు 2 అడుగుల ఎత్తు ఎదిగాక దున్నాలి. ఫలి తంగా సేంద్రీయ కర్బనం, భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెంది నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

నత్రజని శాతాన్ని స్థిరీకరించడంలో పిల్లిపెసర ఉపయోగపడుతుంది. పంట వేర్లలోని బుడి పెల్లో నత్రజని నిల్వ చేసి భూమికి అందిస్తుంది. ఎకరాకు 8 కిలోల వరకు పిల్లిపెసలు చల్లితే 50 కిలోల నత్రజని సమకూరుతుంది. మిరప సాగు చేసే భూముల్లో కూడా ఉపయుక్తంగా ఉంటుంది. మాగాణిలో దుక్కి దున్నగానే ఎకరాకు 30 కిలోల వరకు యూరి యాతో పాటు 12 కిలోల జీలుగు విత్తనాలు చల్లాలి. నెల రోజుల్లో. జీలుగు కలియదున్నేందుకు సరిపోయే ఎత్తు పెరుగుతుంది. అప్పుడు రోటోవేటర్ లేదా కేజీవీల్స్తో దున్నాలి. ఆపైన ఎకరాకు 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేయాలి. దాంతో మొక్కల అవశేషాలు కుళ్లి పచ్చిరొట్ట ఎరువు తయారవుతుంది. కుళ్లే దశలో నీటి తడులు సక్రమంగా అందించాలి. జీలుగ దున్నాక పది రోజుల వరకు ఇతర పంటలు సాగు చేయకూడదు. పది రోజుల వ్యవధిలో విడుదలయ్యే మిథేన్ వాయువు పంటలకు హాని చేస్తుందన్నారు


# సీజనల్ ఫీవర్.. టెన్షన్



కడప, జూలై 26, వర్షాకాలంలో ప్రజలు అధికంగా సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారు. వాతావరణ మార్పులతో తరచుగా జ్వరం, జలుబుతో బాధపడుతుంటారు. రోగాల వ్యాప్తికి ప్రధానంగా దోమలే కారణమని వైద్యులు చెబుతున్నారు. ఇళ్ల వద్ద, వీధుల్లో నీరు నిల్వ చేరడంతో దోమలు విపరీతంగా పెరిగి వ్యాధుల వ్యాప్తికి కారకాలుగా మారుతున్నాయని వివరిస్తున్నారు. వైరల్ జ్వరాలను ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. ? తేలికపాటి జ్వరం.. జలుబు: సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. ఇవి గాలి, నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయి . ఈ వైరల్ ఫీవర్ 3 నుంచి 7 రోజుల వరకు ఉంటుంది. జాగ్రత్తలు: భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్ర పరుచుకోవాలి. నిల్వ పదార్థాలు తినకూడదు? తాజా పండ్లు తీసుకోవాలి . వర్షంలో తడవకూడదు . తడిచిన బట్టలలో ఎక్కువ సేపు ఉండ కూడదు. మాస్క్ తప్పనసరిగా ధరించాలి. ? చికెన్ గున్యా: దోమ కాటు వల్ల చికెన్ గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం , కీళ్ల నొప్పులు చికెన్ గున్యా లక్ష ణాలు , ఇది సోకితే మొదటి రెండు , మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది . జాగ్రత్తలు: ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి . కూలర్లు, టైర్లుమొదలైన వాటిలో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలి. శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి . ? మలేరియా: తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా లక్షణాలు . జ్వరం తగ్గి మళ్లీ వస్తుంది . ఆడ దోమ కాటుతో మలేరియా జిరమ్స్ శరీరంలో లోపలికి వెళ్తాయి . 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది . ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి. జాగ్రత్తలు: దోమతెరలు వినియోగించాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలి. ఒకవేళ నీరు నిల్వ చేరితే అందులో కిరోసిన్ గాని పురుగు మందుగాని పిచికారీ చేయించాలి. ? డెంగీ: వైరల్ జ్వరం మాదిరి అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తీవ్రమైన ఒళ్లు నొప్పులు వస్తాయి. ఎముకలు విరిగిపోతున్నంత బాధ కలుగుతుంది . ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం జరుగుతుంది. పొట్ట, కాళ్లు , చేతులు , ముఖం , వీపు భాగాల చర్మంపై ఎర్రగా కందినట్టు చిన్నచిన్న గుల్లలు కనిపిస్తాయి . ఒక్కోసారి ప్లేట్లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది . ఈడిస్ ఈజిప్టు అనే దోమ కాటుతో డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఇళ్లలోని కుండీలు , ఓవర్ హెడ్ ట్యాంక్లు , ఎయిర్ కూలర్లు , పరిసరాల్లో నిర్లక్ష్యంగా పడేసిన కొబ్బరి బొండాలు , ప్లాస్టిక్ కప్పులు , పగిలిన సీసాలు , టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షపు నీటిలో గుడ్లు పెట్టి ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి. జాగ్రత్తలు:

ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి . చెత్తాచెదారం సమీపంలో ఉండకూడదు. ఇంట్లో దోమల మందు చల్లించుకోవాలి . దోమ తెరలు వాడడం శ్రేయస్కరం . వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలి . ఇంటి పరిసరాల్లో కొబ్బరి బొండాలు , పాత టైర్లు , ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి . ఎయిర్ కూలర్లు , ఎయిర్ కండిషన్లు , పూలకుండీల్లో నీటిని తరచూ మార్చాలి. నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి. శరీరమంతా కప్పి ఉంచుకునేలా దుస్తులు వేసుకోవాలి. ? హెపటైటిస్?ఏ: వర్షాకాలంలో హెపటైటిస్? ఎ ( కామెర్లు) వ్యాధి వచ్చే అవకాశం ఉంది . ఇది కాలేయ కణాలలో సంక్రమణ వల్ల కలుగుతుంది. కలుషితమైన ఆహార పదార్థాల నుంచి , తాగునీటి నుంచి రోగ కారకక్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి . కాలేయ వ్యాధి కారణం గా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. దీంతో శరీర భాగాలు పసుపు రంగులోకి మారిపోతాయి. జాగ్రత్తలు: శుభ్రమైన ఆహారం తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. బయట ఆహారం తినకూడదు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి. ? టైఫాయిడ్: వర్షాకాలంలో టైఫాయిడ్ కేసులు పెరిగే అవకాశం ఉంది . ఇది సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వల్ల వస్తుంది . కలుషిత నీరు తాగడం, ఆహారం తినడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. జాగ్రత్తలు: కాచి చల్లార్చిన నీటిని తాగాలి. బయట ఆహారం తినకూడదు. రోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీటిని సేవించాలి. ముఖ్యంగా పండ్ల రసం, కొబ్బరి నీరు, సూప్ వంటివి తీసుకోవడం మంచిది.

# భారతదేశ మిస్సైల్ మ్యాన్ మన అబ్దుల్ కలాం



**-నేడు ఆయన వర్ధంతి, ఘన నివాళులు అర్పిద్దాం**

భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఈయన పూర్తి పేరు.. డాక్టర్ అవుల్ ఫకీర్ జైనుల్లాబ్దీన్ అబ్దుల్ కలామ్. ఈయన 1931, అక్టోబర్ 15వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు అషియమ్మ జైనుల్లాబ్దీన్, జైనుల్లాబ్దీన్ మరకయార్. ఓ మధ్యతరగతి ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆయన 1958లో మద్రాస్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం) నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పుచ్చుకున్నారు. పట్టభద్రుడైన తర్వాత ఆయన భారతదేశపు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ)లో ఒక విఫలమైన హోవర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు మీద పనిచేయడానికి చేరారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరారు. అక్కడ ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారతదేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎల్వి-ఎఎఎ)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వీ క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-ఎఎ అణుపరీక్షలు విజయవంతంగా పూర్తి చేయడంజరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్రరాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈయనకు భారతదేశ అత్యున్నత పురస్కారాలైన పద్మ భూషణ్ (1981), పద్మ విభూషణ్ (1990), భారతరత్న (1997)లు వరించాయి. అలాగే, దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీసం 30వరకు యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగుపెట్టారు. ఈయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాంపై వామపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా 87-ఏళ్ళ లక్ష్మీ సెహగల్ పోటీ చేశారు. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తారు. "ప్రజలు.. తమ భార్యాపిల్లలకు తమ పిల్లల పిల్లలకూ ఆస్తులు సంపాదించి పెట్టడం కోసమే అవినీతిపరులౌతారు" అంటూ ఆయన బ్రహ్మచర్యాన్ని స్వీకరించారు. ఇస్లాం ప్రకారమైతే ప్రతి ముస్లిమూ పెళ్ళి చేసుకోవాలి. కానీ, కలాం ఖురాన్‌తో పాటు, భగవద్గీతను కూడా చదువుతారు. మతఘర్షణలను నిరసించే శాంతికాముకుడిగా పేరుగడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. రాష్ట్రపతిగా కూడా సేవలందించిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం జూలై 27, 2015 సోమవారం సాయంత్రం హఠాన్మరణానికి గురయ్యారు. షిల్లాంగ్‌లోని ఐఐఎంలో సోమవారం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం హఠాత్తుగా ప్రసంగం మధ్యలో కుప్పకూలిపోయారు. గుండెపోటుతో కుప్పకూలిన అబ్దుల్ కలాంను స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 45 నిమిషాల వ్యవధిలోనే కలాం కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 84 సంవత్సరాలు.

# చంద్రబాబు కు వయసు మళ్లింది...

విజయవాడ దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించే మీడియా ఓనర్స్, ప్రతినిధులు కు దేవుని ఆశీస్సులు ఉండాలి. పాలకులే మీడియా ను భయపెడుతున్నారని ప్రజాశాంతి పార్టీ అధినేత కే ఏ పాల్ అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు. అదానీ లాంటి వాళ్లు మీడియా ను కొనేస్తున్నారు.వినకపోతే చంపేవరకూ వెళుతున్నారు.అంతు చూస్తామని కొంతమంది రాజకీయ నాయకులు అంటున్నారు.ప్రజా స్వామ్యం చనిపోతుందని ముందే చెప్పా.. ఇప్పుడు అదే జరిగింది.న్యాయ వ్యవస్థ పై కూడా నలుగురు న్యాయమూర్తులు బయటకి వచ్చి మాట్లాడారు. కొంతమంది న్యాయ మూర్తులను బెదిరించే స్థాయికి వచ్చారు. ఈవిఎం లు అయితే బిజెపి కి 300 సీట్లు తప్పవని చెప్పా. బ్యాలెట్ విధానం లో ఎన్నికలు పెట్టాలని కోరా. ఈవిఎం లతో మళ్లీ బిజెపి అధికారంలోకి వచ్చింది. ప్రజా శాంతిపార్టీ లో చేరేందుకు ఐఎయస్, ఐపియస్ అధికారులు ఆసక్తి చూపుతున్నారు. నేషనల్ మీడియా ఒత్తిళ్లకు లొంగి అమ్ముడుపోయిందని ఆరోపించారు.తెలుగు మీడియా భయపడకుండా వార్తలు ఇస్తున్నారు. అటువంటి టివి, పేపర్ యజమానులకు అభినందనలు. మోడీ ప్రతిపక్ష నేతల పై సిబిఐ, ఈడి లతో దాడులు చేయిస్తున్నారు. మన దేశం, ఆర్థిక వ్యవస్థ ప్రమాదం లో ఉంది. ఈవిఎం పద్ధతి న ఓటింగ్ వద్దు... బ్యాలెట్ విధానమే ముద్దు. న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు స్పందించాలని అన్నారు.లైవ్ లు ఇచ్చే ఛానల్స్ ను దేవుడు ప్రత్యేకంగా దీవిస్తాడు. ప్రజా శాంతి పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. బూత్ కమిటీ లు అయ్యే వరకు జిల్లాల్లో తిరుగుతా. ఎపికి ఎనిమిది లక్షల కోట్లు అప్పు.. రూపాయి పుట్టే పరిస్థితి లేదు. తెలంగాణ లో ఐదు కోట్ల అప్పు.. ఏం చేశారో తెలియదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కుటుంబ, కుల, కుట్ర రాజకీయాలకు చరమ గీతం పాడాలి. ఈ దేశం మరో శ్రీలంక లాగా మారుతుంది. మోడీ 76లక్షల కోట్లు అప్పు చేశారు. వచ్చే ఎన్నికలలో మార్పు కోసం ప్రజలంతా కలిసి రావాలి. మోడీకి కూడా నేను లేఖలు రాశాను. ఆరు నెలల్లోనే మన దేశం నాశనం కాబోతుంది. రోగికి డాక్టర్ మెడిసిన్ ఇచ్చిన విధంగా.. ఈ దేశానికి మంచి మందు కావాలి. దేశ ఆర్థిక పరిస్థితి గమనించి, సరి దిద్దాలి. మన దేశం, రాష్ట్రాలు ఆర్థికంగా చనిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. దేశ, రాష్ట్ర నాయకులు ప్రభుత్వ సంపదను వారి నాయకులకు దోచి పెడుతున్నారు. అదానీ కి అన్యాయంగా ఆస్తులు అప్పగిస్తున్నారు. రాష్ట్ర విభజన బిల్లులో అంశాలను అమలు చేయలేదని అన్నారు.ఈ రాష్ట్రం నాశనం కావడానికి నలుగురు ప్రధాన కారణం. మాజీ సిఎం చంద్రబాబు నేను చెప్పిన సలహాలను పట్టించుకోలేదు. ఆయన ప్రధానమంత్రి కావడానికి, కొడుకు ను సిఎం చేయడానికి రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఐదేళ్లలో రాజధాని కట్టలేదు, ఉద్యోగాలు ఇవ్వలేదు. మోడీ చేసిన అన్యాయాన్ని ప్రశ్నించలేదు. చంద్రబాబు కు వయసు మళ్లింది... ఇప్పుడు అయినా నాకు మద్దతు ఇవ్వండి. నేను ఐదేళ్లల్లో అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తా. చంద్రబాబు, జగన్, నేను ముగ్గురం ఒకే వేదిక పై చర్చ కు సిద్దం.

# మాజీ మంత్రి దేవినేని ఉమా హౌస్ అరెస్ట్

విజయవాడ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దళిత మహిళలపై అత్యాచారాలకు నిరసనగా, వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాల సాధన కోసం టిడిపి ఎస్సిసెల్ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో ఈ రోజు మంగళవారం విజయవాడలో దళిత గర్జన నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపధ్యంలో మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ను పోలీసులు ముందస్తు హౌస్ అరెస్ట్ చేసారు. దేవినేని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నీరుగార్చిందని, దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. మూడేళ్ళ పాలనలో జగన్ ఎస్సీలకు మొండి చేయి చూపించారు. దళితుల కోసం కేటాయించిన వేలకోట్ల సబ్ప్లాన్ నిధులను వైసీపీ పాలకులు దారిమళ్లించారు. తిరిగి ఆనిధులన్నింటినీ రాబట్టి దళితుల సంక్షేమానికి కేటాయించాలి. నిలిపివేసిన బ్యాంకు లింకేజీ రుణాలను వెంటనే పునరుద్ధరించాలి. ఎస్సీల కోసం గతంలో అమలు చేసిన భూమి కొనుగోలు పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దళిత బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వాలు అమలు చేసిన బెస్ట్ అవైలబుల్, అంబేడ్కర్ విద్యా స్కీంలను జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిపివేసింది. కేంద్రం ఇచ్చే పథకాలన్నింటినీ కాలరాచింది. దళితులంతా చైతన్యవంతులై జగన్ సర్కార్ పై సమరశంఖం పూరించాలని అన్నారు.

# అక్రమ సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్య

పామర్రుకృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలంలో దారుణ హత్య జరిగింది. అక్రమ సంబంధం నేపథ్యంలో యాకమూరు కు చెందిన శ్రీనివాస రెడ్డి అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి లు ఇద్దరూ ఆళ్ళవారి పాలెం కు చెందిన మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నారు. అదే మహిళతో ఇంటి వద్ద శ్రీనివాస రెడ్డి మృత దేహం రక్తపు మడుగులో పడివుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శ్రీకాంత్ రెడ్డి, మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం. వారిద్దరూ కలిసి హత్య చేసినట్లుగా గ్రామస్థులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. డాగ్ స్వాడ్, క్లూస్ టీమ్ లతో పోలీసులు విచారిస్తున్నారు.

# మంథనిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

మంథని ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీ పై ఈడీ విచారణ పేరుతో కక్ష సాధింపు చర్యలకు నిరసనగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే, దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సెగ్గం రాజేష్, పట్టణ అధ్యక్షులు పోలు శివ ల ఆధ్వర్యంలో మంగళవారం మంథని అంబేద్కర్ చౌరస్తలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సెగ్గం రాజేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాలను చేపట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై ఈడీ విచారణ చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలపై బిజెపి ప్రభుత్వం బురదజల్లే కార్యక్రమం చేపట్టిందని, రాబోయే కాలంలో బిజెపికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్రు రమాదేవి, ఆయేషా ఆరిఫ్, గోటికార్ కిషన్ జీ, జంజర్ల శేఖర్, పెరవేన లింగయ్య యాదవ్, మంథని సత్యం, బండారి ప్రసాద్, మాచిడి సత్యనారాయణ, వేల్పుల పోచం, రావికంటి సతీష్, బండ కిషోర్ రెడ్డి,అరెల్లి కిరణ్ గౌడ్, ఎరుకల ప్రవీణ్, నాగుల రాజయ్య లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్గిల్ అమరులకు నివాళులు

విశాఖపట్నం కార్గిల్ విజయ దివాస్ను పురస్కరిం చుకొని కార్గిల్ అమరవీరులకు నేవీ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు నివాళు లర్పించారు. నేవీ ఆధ్వర్యం లో ఆర్కే బీచ్ రోడ్ వార్ మెమోరియల్ వద్ద కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. 1999 జులై 26న తొలి కార్గిల్ విజయ్ దినోత్సవం జరిగింది. అప్పటి నుంచీ ప్రతీ సంవత్సరం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.ఈ విజయం వెనుక ఎంతో మంది సైనికుల ప్రాణ త్యాగం ఉంది. తమ ప్రాణాలను అడ్డుపెట్టి మన దేశాన్ని రక్షించడమే కాదు.. పాక్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టారు. అంతర్జాతీయ స్థాయిలో పాక్ వక్ర బుద్ధిపై దెబ్బ కొట్టి సైనికుల సత్తా చాటారు. పాకిస్థాన్ వక్రబుద్ధిని భారత వీరులు విజయవంతంగా తిప్పి కొట్టారు. దాయాది దేశం పాకిస్తాన్ కన్ను ఎప్పుడూ భారత్ పైనే.. ముఖ్యంగా కశ్మీర్ పైనే ఉంటుంది. ఏదో ఒక వంకతో స్థానిక యువతను రెచ్చగొడుతూ దేశంలో అలజడి సృష్టిస్తూనే ఉంటుంది. అలాంటి ప్రయత్నమే 1999లో కూడా చేసింది.అందుకు ఉగ్రవాదులతో పాక్ ఆర్మీ చేతు లు కలిపింది. సహజ నిబంధనలు ఉల్లంఘించి నియంత్రణ రేఖ దాటి వచ్చి మన ఆర్మీపై దాడికి తెగబడింది. ఇండియన్ ఆర్మీ ధీటుగా స్పందించింది. ఆపరేషన్ విజయ్ పేరుతో పాక్కు బుద్ధి చెప్పింది.ఈ నేపథ్యంలో పలువురు నేవి సిబ్బంది వీరమరణం పొందారు.కార్గిల్ విజయ దినోత్సవాన్ని ప్రతీ ఏటా జూలై 26న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో ప్రజలు సైతం సైనికుల త్యాగాలకు గుర్తుగా క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించడం ఆనవాయితీగా వస్తోంది.దింట్లో భాగంగా విశాఖలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున్,తో పాటు అధికారులు ఘనంగా నివాళి అర్పించారు.

## ఏజెన్సీలో ఆగని గంజాయి దందా..మళ్ళీ పట్టుబడిన గంజాయి.

అల్లూరు అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతూరు పోలీసులు తులసిపాక అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 150 కేజీల గంజాయిని పట్టుకున్నారు.మహీంద్రా కారులో ఈ గంజాయిని తరలిస్తున్నారు.ఈ గంజాయిని సుకుమామిడి నుండి రాజమండ్రికు తరలిస్తుంన్నారు.దీని విలువ నాలుగు లక్షల యాభై వేలు ఉంటుందని ఒడిషా కి చెందిన ఇద్దరు, నిందితులను అదుపులోకి తీసుకున్నామని,ఒడిషాకే చెందిన ఒక నిందితుడు పరారీలో ఉన్నారని వాహనాన్ని సీజ్ చేసి, వారి వద్ద మూడు చరవాణీలను స్వాధీనం చేసుకున్నామని సబ్ ఇన్స్పెక్టర్ వాసంశెట్టి సత్తిబాబు తెలియజేశారు

